

జూలో మర్రిఊడలతో ఆటలు



రుషికొండ బీచ్‌కు పోటెత్తిన సందర్శకులు



కైలాసగిరిపై వనభోజనాలు చేస్తున్న విద్యార్థినులు

పిక్నిక్ సందడి

నగర పరిధిలోని పర్యాటక ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. కార్తీకమాసం, అందులోనూ ఆదివారం కావడంతో నగర వాసులతో పాటు ఇతర జిల్లాల నుంచి వేలాదిగా పర్యాటకులు తరలివచ్చారు. దీంతో ఆదివారం ఉదయం నుంచి జూ పార్క్, కైలాసగిరి, బీచ్ రోడ్డు, వుడా పార్క్‌తోపాటు ఇతర సందర్శనీయ స్థలాలు కిటకిటలాడాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వనభోజనాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

కమిటీలతో కాలయాపన

- ఏయూలో అడ్డగోలు వ్యవహారాలపై చర్యలకు వెనకడుగు
- ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారుల పరిస్థితి
- గత వీసీపై విచారణను పట్టించుకోని ప్రభుత్వం



విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని అనేక వ్యవహారాలపై ఉన్నతాధికారులు కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా అనేక అంశాలపై కమిటీలు వేశారు. ఇవి ఏమి తేల్చాయన్న దానిపై ఇప్పటి వరకు వివరాలను వెల్లడించలేదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వర్సిటీ అధికారులు ఏయూ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, సెంటర్ ఫర్ డిస్టెన్స్ స్టడీస్, రూసా ఫేజ్-2, స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఏయూ టీడీఆర్ హబ్‌ల్లో జరిగిన వ్యవహారాలపై విచారణకు కమిటీలు వేశారు. కమిటీ సభ్యులుగా ఏయూ ప్రొఫెసర్లతోపాటు ఇతర విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు, నిపుణులను నియమించారు. ఇవి నియమించి రెండు నెలలు దాటుతు న్నా విచారణ నివేదికలోని అంశాలను వెల్లడించలేదు. గత నెలలో జర్నలిజం కాలేజీ విభాగాధిపతిగా పనిచేసిన డాక్టర్ సీఎం వినయ్‌కుమార్‌ను తొలగించడంతో పాటు విచారణకు ఆదేశించారు. వర్సిటీలో పనిచేస్తూనే కృష్ణా వర్సిటీలో గైడ్‌గా వ్యవహరించారంటూ గవర్నర్‌కు పలువురు ఫిర్యాదు చేయడంతో పూర్తిస్థాయి విచా రణ జరిపి నివేదిక ఇచ్చేలా కమిటీని నియమించారు. దీంతో పాటు వర్సిటీలోని అనేక ప్రాంతాల్లో ఇష్టానుసారంగా ఏర్పాటైన కంటైనర్ షాపులు తొలగించాలని భావించారు. ఉన్నత స్థాయిలో ఒత్తిళ్లు రావడంతో దానిపై మరో కమిటీని వేశారు. తాజాగా వర్సిటీలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ పైడి శ్రీనివాస్‌పై విచారణకు ఆదేశిస్తూ ఐదుగురితో కమిటీని ఏర్పాటుచేశారు. సెలవు పెట్టినా పరిగణనలోకి తీసుకోకుండా ఒక అధికారి ఒత్తిళ్లతో ఇబ్బందులకు గురిచేశారంటూ సదరు ఉద్యోగి చేసిన ఫిర్యాదులను పట్టించుకోలేదు. ఏడాదిన్నరపాటు విధుల్లోకి .. మిగతా 6వ పేజీలో

రైల్వేలో కలకలం

డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్‌ను అరెస్టు చేసిన సీబీఐ

కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటుండగా ముంబైలో పట్టివేత





డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్

- ఇక్కడి కార్యాలయం, నివాస భవనంలో అధికారుల సోదాలు
- కీలక దస్త్రాలు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం
- ఆందోళనలో రైల్వే ఉద్యోగులు

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే డివిజన్‌లో ఆదివారం కలకలం రేగింది. లంచం తీసుకుంటూ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ముంబైలో సీబీఐ అధికారులకు చిక్కారనే వార్త డివిజన్‌లో పని చేస్తున్న ఉద్యోగులతో పాటు నగర వాసుల్లోనూ సంచలనం కలిగింది. డివిజన్ చరిత్రలో డీఆర్ఎం స్థాయి అధికారి సీబీఐకి పట్టుబడడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. డీఆర్ఎంతో సహా మరో ఇద్దరిని సీబీఐ ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్టు ప్రకటించడంతో ఇక్కడి సిబ్బందిలో ఆందోళన నెలకొంది.

నగరంలోని డీఆర్ఎం కార్యాలయం, అధికారిక నివాసంతో పాటు ముంబైలో శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం తెల్లవారుజాము మూడు గంటల వరకు సీబీఐ అధికారులు దాడులు చేశారు. ఈ సందర్భంగా పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో డివిజనల్ అధికారులు, సంబంధిత సిబ్బందిని కూడా వారు విచారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో వాల్తేరు డివిజన్ ప్రధాన కార్యాలయంలోని అధికారులు, సిబ్బందిలో ఆందోళన నెలకొంది. కొందరు సిబ్బంది సెల్‌ఫోన్‌లో మాట్లాడేందుకు కూడా భయపడుతున్నారు.

జరిమానా తగ్గింపునకు లంచం డిమాండ్

వాల్తేరు డివిజన్‌లో చేపట్టిన నిర్మాణ పనుల్లో జాప్యం జరగడంతో డీఆర్ఎం ఇద్దరు కాంట్రాక్టర్లకు భారీగా జరిమానా విధించారు. అంతేకాకుండా వారు చేపట్టిన ఇతర పనులకు సంబంధించిన బిల్లులు కూడా నిలిచిపోయాయి. దీంతో వారు డీఆర్ఎంను కలిసి, జరిమానా తగ్గించి, బిల్లులు మంజూరు చేయాలని కోరారు. దీంతో ఒక్కొక్కరు రూ.25 లక్షల చొప్పున ఇవ్వాలని డీఆర్ఎం కోరారు. ఈ మేరకు ముంబైలో డబ్బు ఇస్తుండగా అప్పటికే అందిన సమాచారంతో సీబీఐ అధికారులు పట్టుకున్నారు.

అసలేంజరిగింది...

గత డీఆర్ఎంలతో పోల్చితే సౌరబ్‌ప్రసాద్ వ్యవహారశైలి భిన్నంగా ఉంటుందని సిబ్బంది చెబుతున్నారు. ఇక్కడ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తన చాంబర్‌లోకి ఇతరులను పరిమితంగా అనుమతించేవారని, శాఖాధికారులు మినహా ఇతరులు, కాంట్రాక్టర్లను రానివ్వలేదని సమాచారం. తన స్థాయిలో .. మిగతా 6వ పేజీలో

ఫోర్బ్స్ మెచ్చిన తారా మండల్

అంతర్జాతీయ బిజినెస్ సామర్థ్యం కలిగిన సార్టప్‌గా గుర్తింపు

- ప్రపంచవ్యాప్తంగా 30 వేలకుపైగా నామినేషన్లు
- టాప్-200 కంపెనీల్లో ఒకటిగా నిలిచిన తారా మండల్
- ఏపీ నుంచి గుర్తింపు పొందిన తొలి శాటిలైట్ స్టార్టప్
- ఫౌండర్స్‌లో వెల్లివిరిసిన ఆనందం



స్టార్టప్ వ్యవస్థాపక సభ్యులు

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖకు చెందిన స్టార్టప్ సంస్థ తారామండల్‌కు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. స్పేస్‌లో ఉండే శాటిలైట్ వ్యర్థాలను భూమిపైకి తీసుకురావడంతో పాటు సుస్థిరమైన శాటిలైట్స్ టెక్నాలజీపై పనిచేయడంయడం, అంతర్జాతీయంగా బిజినెస్ సామర్థ్యం కలిగిన, రానున్న రోజుల్లో వృద్ధిలోకి వచ్చే కంపెనీ (స్టార్టప్)గా ఫోర్బ్స్ ఇండియా, డిగ్లోబలిస్ట్ సంస్థ తారా మండల్‌ను గుర్తించాయి.

ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఉన్న స్టార్టప్ కంపెనీల పనితీరును పరిశీలించి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని కంపెనీస్ విత్ గ్లోబల్ పొటెన్షియల్ పేరుతో 200 కంపెనీలతో కూడిన జాబితాను శనివారం విడుదల చేసింది. ఈ జాబితాలో విశాఖకు చెందిన తారా మండల్ అనే స్టార్టప్ చోటు దక్కించుకుంది. ఏపీ నుంచి చోటు దక్కించుకున్న ఏకైక స్టార్టప్ కావడం గమనార్హం. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల నుంచి 30 వేలకుపైగా కంపెనీలు, స్టార్టప్‌ల నుంచి నామినేషన్లు స్వీకరించిన ఫోర్బ్స్ ఇండియా, డి గ్లోబలిస్ట్ సంస్థలు ఆరు నెలలుగా అనేక అంశాలను పరిశీలించాయి. ప్రధానంగా కంపెనీ సామర్థ్యం, పేటెంట్స్, గ్రోత్, భవిష్యత్తులో సదరు సంస్థ అవసరం వంటి అనేక అంశాలను పరిశీలించి అంతర్జాతీయంగా ఎదిగే సామర్థ్యం ఉన్న కంపెనీగా తారా మండల్‌ను ఎంపిక చేశాయి. ఇండియా నుంచి ఈ జాబితాలో 70 కంపెనీలు/ స్టార్టప్‌లు మాత్రమే చోటు దక్కించుకోగా, మిగిలిన దేశాల నుంచి 130కుపైగా కంపెనీలున్నాయి.

ఎందుకు పనిచేస్తుందంటే...

స్పేస్‌లో ఉండే శాటిలైట్ వ్యర్థాలను భూమిపైకి తీసుకురావడంతోపాటు సుస్థిర మైన శాటిలైట్స్ టెక్నాలజీపై ఈ స్టార్టప్ పనిచేస్తుంది. సాధారణంగా స్పేస్‌లోకి వెళ్లే శాటిలైట్లు కొన్నాళ్ల (పీరియడ్) తరువాత వ్యర్థాలుగా కక్ష్యలో తిరుగుతుంటాయి. ఈ వ్యర్థాలను భూమిపైకి తీసుకురావడంతో పాటు కొత్తగా పంపించే శాటిలైట్స్ కాల పరిమితి తరువాత తిరిగి భూమిపైకి వచ్చే శాటిలైట్ టెక్నాలజీపై ఈ సంస్థ పనిచేస్తోంది. దీనివల్ల భవిష్యత్తులో శాటిలైట్ వ్యర్థాలు స్పేస్‌లో పెరగకుండా, ప్రమాదాలు సంభవించకుండా కాపాడే అవకాశం ఉంటుంది. ఈ స్టార్టప్ సంస్థ పనితీరు, భవిష్యత్తులో గొప్పగా ఎదిగేందుకు ఉన్న అంశాలను పరిశీలించిన ఫోర్బ్స్ ఇండియా టాప్-200 కంపెనీలో ... మిగతా 6వ పేజీలో



రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా పోలీసు శాఖ పనిచేస్తోందని సీపీ శంఖబ్రత బాగ్చి అన్నారు. ట్రాఫిక్ విభాగం, రోడ్డు, ఫైర్ సేఫ్టీ, రోటరీ డిస్ట్రిక్ట్ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఏయూలో ప్రపంచ రోడ్డు బాధితుల దినం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. - వివరాలు 7లో



ఆకట్టుకున్న పరంపర నృత్యోత్సవం

- వివరాలు లోపలి పేజీల్లో

బైక్ రేసులపై పోలీసుల స్పెషల్‌డ్రైవ్

- 45 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న టూవీలర్లు

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో బైకరేస్‌ల నియంత్రణలో భాగంగా త్రీటౌన్ పోలీసులు శనివారం రాత్రి బీచ్ రోడ్డులో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈస్ట్ సబ్‌డివిజన్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి ఆదేశాల మేరకు త్రీటౌన్ సీఐ పి.రమణయ్య ఆధ్వర్యంలో తొమ్మిది ప్రత్యేక బృందాలు ఈనెల 16న రాత్రి బీచ్‌రోడ్డుతోపాటు పలు ప్రధాన రోడ్లపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రేసింగ్‌లకు పాల్పడుతున్నవారు, భారీ శబ్దం కలిగించే మాడిఫైడ్ సైలెన్సర్లతో ఇబ్బంది కలిగిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. 45 బైక్‌లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన యువకుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

టీచర్ ఎమ్మెల్సీ ఓటుకు 17,404 దరఖాస్తులు

- అత్యధికంగా శ్రీకాకుళం జిల్లా నుంచి 4,464
- తక్కువగా అల్లూరి జిల్లాలో 1,749
- 23 నుంచి అభ్యంతరాల స్వీకరణ

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదుకు తొలి విడతలో 17,404 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లా నుంచి 4,464 మంది దరఖాస్తుచేయగా, అతి తక్కువగా అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 1,749 మంది మాత్రమే దరఖాస్తు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఉపాధ్యాయులు ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీ నుంచి ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈనెల ఆరోతేదీ వరకు గడువు విధించింది. ఇందులో భాగంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల నుంచి ఆఫ్‌లైన్‌లో 12,602 మంది, ఆన్‌లైన్‌లో 4,802 మంది మొత్తం 17,404 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాల వారీగా చూస్తే శ్రీకాకుళం జిల్లాలో ఆన్‌లైన్‌లో 2,072 మంది, ఆఫ్‌లైన్‌లో 2,392 మంది వెరసి 4,464, విజయనగరం జిల్లాలో ఆన్‌లైన్‌లో 555 మంది, ఆఫ్‌లైన్‌లో 3,273తో వెరసి 3,828 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో ఆన్‌లైన్‌లో 340 మంది, ఆఫ్‌లైన్‌లో 1,796 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆన్‌లైన్‌లో 212 మంది, ఆఫ్‌లైన్‌లో 1537 మంది, విశాఖపట్నం జిల్లాలో ఆన్‌లైన్‌లో 1252 మంది, ఆఫ్‌లైన్‌లో 2,093 మంది, అనకాపల్లి జిల్లాలో ఆన్‌లైన్‌లో 371 మంది, ఆఫ్‌లైన్‌లో 1511 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా ఓటర్ల ముసాయిదా జాబితాను ఈ నెల 23న విడుదల చేస్తారు. అనంతరం అభ్యంతరాలను స్వీకరిస్తారు. కాగా ఇంతవరకు దరఖాస్తుచేయని టీచర్లు అదే రోజు నుంచి కొత్తగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు.





అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి సిరి సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండపం ప్రదక్షిణ జరిపారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ పుష్పాలతో పూజ చేశారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు,శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం నిత్య కల్యాణం నిర్వహించారు.

ఆనందపురంలో శివ పార్వతుల కల్యాణం

ఆనందపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం శివాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు రాంబాబు శర్మ, సుబ్రహ్మణ్య శర్మ కల్యాణ తంతు నిర్వంహించగా పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అనంతరం రెండు వేల మందికి అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ఆనందపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) :కణమాం పంచాయతీ గోరింటలో దుర్గాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి పూజలు, అభిషేకాలు నిర్వహించి, అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కర్త పినిశెట్టి సింహాచలం నాయుడు, వేములవలస ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఏడో వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు

మధురవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : టీడీపీకి సభ్యత్వాలతోనే బలం చేకూరుతుందని పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు అన్నారు. ఏడో వార్డులోని మల్లయ్యపాలెంలో ఆదివారం ఆయన సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి కానూరి అచ్చుతరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి దుర్గారావు,గుదే అచ్చుతరావు, కలివేల్పు సూరిబాబు, కొల్లి చిరంజీవి, కానూరి కృష్ణ, కొల్లి సంతోష్ పాల్గొన్నారు.

భీమిలిలో..

భీమునిపట్నం : టీడీపీ సభ్యత్వాల నమోదును కార్యకర్తలు వేగవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు ఆన్‌లైన్‌లో సభ్యత్వాలు నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే గంటా పిలుపుమేరకు నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాల లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి చేయాలన్నారు.

నారా రామ్మూర్తి నాయుడు మృతి పట్ల సంతాపం

మధురవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చంద్రగిరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు మృతి టీడీపీకి తీరని లోటని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఆ పార్టీ విశాఖ పార్లమెంటు కార్యదర్శి నాగోతి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో మధురవాడలో రామ్మూర్తినాయుడు సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ, పిళ్లా రాము, నాగోతి రాము, ఇరోతి అప్పారావు పాల్గొన్నారు.



కైలాసగిరిపై పర్యాటకుల సందడి

తీరంలో సండే సందడి

భీమిలి, రుషికొండ, సాగర్‌నగర్, కైలాసగిరి ప్రాంతాలు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడాయి. పిక్నిక్ సీజన్ కావడంతో నగరవాసులతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వేలాది మంది పర్యాటకులు తరలివచ్చారు. దీంతో అన్ని సందర్శనీయ స్థలాలు జనంతో కళకళలాడాయి.

- భీమునిపట్నం/సాగర్‌నగర్/ఎండాడ



పర్యాటకులతో రద్దీ ఉన్న రుషికొండ బీచ్‌కు వెళ్లే మార్గం



రుషికొండలో శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



పర్యాటకులతో కిటకిటలాడుతున్న భీమిలి బీచ్



ఫ్లాష్‌మాబ్ నిర్వహిస్తున్న గీతం విద్యార్థినులు

దంత సంరక్షణపై గీతం విద్యార్థుల ఫ్లాష్‌మాబ్

సాగర్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో నోటి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ గీతం దంత వైద్య కళాశాల విద్యార్థులు వైఎంసీఏ వద్ద ఆదివారం ఫ్లాష్‌మాబ్, వీధినాటిక నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు చిన్న పిల్లల దంత సంరక్షణ పద్ధతులు, బ్రష్ చేసుకునే విధానంపై వివరించారు. అందమైన, ఆరోగ్యకరమైన దంతాలు పూర్తి ఆరోగ్యానికి చాలా అవసరమైనవని, ముఖ్యంగా పిల్లలు తినడం, మాట్లాడడంలో ఇవి ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతం దంత కళాశాల, ఆసుపత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ నరసింహారావు, పిడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అందుబాటులో లేని లిఫ్ట్ సౌకర్యం



లిఫ్ట్ పని చేస్తున్నా.. మెట్లు ఎక్కుతున్న వృద్ధులు

సింహాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే వృద్ధులకు ఇక్కట్లు తప్పడం లేదు. వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగుల సౌకర్యార్థం ఆలయ ప్రధాన రాజగోపురానికి చేరువగా పదేళ్ల క్రితం లిఫ్ట్ సౌకర్యం కల్పించారు. దేవస్థానం ఈఓ లిఫ్ట్ వద్ద భక్తుల రద్దీని నియంత్రించేందుకు శని, ఆదివారం ప్రత్యేక సిబ్బందికి డిప్యూటేషన్ డ్యూటీలు కేటాయిస్తున్నారు. అయితే సిబ్బంది ప్రోటోకాల్ పేరుతో రాజకీయ నాయకులు, అధికారులకు, ఇతరులకు లిఫ్ట్‌లో వెళ్లేందుకు అనుమతి ఇస్తున్నారు తప్ప వృద్ధులను, గర్భిణులను వెళ్లనీయడం లేదు. రద్దీ రోజుల్లో సిఫార్సు లేఖల ఒత్తిడి పడలేక లిఫ్ట్‌ను నిలిపివేస్తున్నారు. అదే సమయంలో లిఫ్ట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలనుకునే వృద్ధులు, దివ్యాంగులకు ఆ సేవలు అందక రాజగోపురానికి ఉన్న 60 మెట్లను ఎక్కి స్వామివారిని దర్శించుకోవాల్సి వస్తోంది. ఈ విషయమై ఈఓ దృష్టిసారించాలని భక్తులు కోరుతున్నారు.

బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం స్పందించాలి

ఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

డాబాగార్డెన్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు చెల్లించవలసిన 11వ పీఆర్‌సీ, డీఏ సరెండర్ లీవ్ బకాయిలు, పి.ఎఫ్, ఏపీజీఎల్ఐ తుది చెల్లింపులు, రుణాల చెల్లింపులపై ప్రభుత్వం ఇంతవరకు స్పందించలేదని తక్షణమే దీనిపై ప్రకటన చేయాలని ఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని చంద్రాస్ హోటల్‌లో ఎస్‌టీయూ ఉత్తరాంధ్ర జిల్లాల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 12వ పీఆర్సీ అమలు చేయవలసిన గడువు ఇప్పటికే 17 నెలలు ఆలస్యమైందన్నారు. వెంటనే 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించి పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర భారాన్ని తగ్గిస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఆచరణలో చూపడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ మెమో నంబర్-57 మేరకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను వర్తింపజేయాల్సి ఉన్నా మీనమేషాలు లెక్కిస్తుండడం సమంజసం కాదని పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలపై ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థిక బకాయిలపై ప్రభుత్వం స్పందించకపోతే ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉద్యమానికి శ్రీకారం చుడతామని రఘునాథరెడ్డి హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి శ్యామ్, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేముడుబాబు, పైడిరాజు, రమణమూర్తి, తమ్మినాయుడు, పాల్గొన్నారు.

నేరాల పట్ల అప్రమత్తం : ఎస్ఐ

భీమునిపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్‌కు ప్రతిరోజూ వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారని, ఏవిధమైన నేరాలు జరగకుండా పోలీసులకు ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారం అందించాలని బీచ్ ఫొటోగ్రాఫర్లను ఎస్ఐ సూర్య ప్రకాశ్‌రావు కోరారు. ఆదివారం ఆయన సాగర తీరంలో ఫొటోగ్రాఫర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిల్లర దొంగతనాలు, విలువైన వస్తువుల చోరీ, మహిళలను వేధించడం వంటి సంఘటనలు జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న ఉమ్మడి విశాఖ జిల్లా గురుకులాల సమన్వయకర్త రూపావతి

సాంకేతికపై అవగాహన అవసరం

కొమ్మాది, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సాంకేతిక పట్ల అవగాహన పెంచుకోవాలని, అప్పుడే ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోగలరని విశాఖ చాప్టర్ ఐజీఎస్ ఛైర్మన్ ఆచార్య కె.నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కొమ్మాది గురుకుల ప్రతిభా పాఠశాలలో ప్రిన్సిపాల్ డి. శాంతకుమారి ఆధ్వర్యంలో భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) దినోత్సవం నిర్వహించారు.ముందుగా ఉమ్మడి విశాఖ జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయకర్త రూపావతి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆచార్య కె. నాగేశ్వరరావు మాట్లాడుతూ 1999 నుంచి జీఐఎస్ దినోత్సవం చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీఐఎస్ సభ్యురాలు హేమమాలిని, సెక్రటరీ వజీర్ అహ్మద్, సీనియర్ సైంటిస్టు మంగళమణి, వైస్ ప్రిన్సిపాల్ నవనీతావాణి, తదితరులు పాల్గొన్నారు.

'యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలి'



పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసిన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఎండాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఎండాడలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నేషనల్ షొటొకాన్ కరాటే అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ సౌజన్యంతో వాల్తేరు మార్షల్ ఆర్ట్స్ కరాటే-డూ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత మార్షల్ ఆర్ట్స్ వైపు ఆకర్షితులవుతున్నారని, నిర్వాహకులు వారిని ప్రోత్సహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న తిరువీధి



మాడవీధిలో స్వామివారి తిరువీధి

సింహాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వృశ్చిక సంక్రమణం పుణ్యతిథి పురస్కరించుకుని సింహగిరిపై ఆదివారం సాయంత్రం అప్పన్నస్వామి తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రతి మాసంలో వచ్చే సంక్రమణాన్ని పురస్కరించుకుని స్వామివారి తిరువీధి ఉత్సవం జరపడం ఆనవాయితీ. ఈమేరకు సాయంత్రం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూ, నీలాదేవిలతో విశేషంగా అలంకరించి పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ మాడవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. మార్గం పొడవునా భక్తులకు ఫలాలు, కర్పూర నీరాజనాలిచ్చి ఆహ్వానించారు.



శ్రీఘ్ర దర్శనం క్యూ వద్ద భక్తులు

భక్త సంద్రమైన సింహగిరి

ఒక్క రోజులో రూ.27.57 లక్షల ఆదాయం

సింహాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్తీక మాసం కావడంతో నగరవాసులతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన వారు వందలాదిగా తరలివచ్చారు. అలాగే శనివారం రాత్రి నగరంలో జరిగిన వివాహాల్లో ఒకటైన జంటలు, వారి బంధుమిత్రుల రాకతో సింహగిరి కిటకిటలాడింది. కొంత మంది కొండదిగువ వరాహ పుష్కరిణిలోనూ, మరికొందరు సింహగిరిపై ఉన్న గంగధార జలధారల్లోనూ పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం ఒక్క రోజే స్వామివారి ఖజానాకు సుమారు రూ. 27.57లక్షలు ఆదాయం సమకూరింది. అత్యధికంగా అతిశ్రీఘ్ర దర్శనం రూ.300, శ్రీఘ్రదర్శనం రూ.100 టికెట్ల విక్రయాల ద్వారా రూ.16.17లక్షలు, పులిహోర, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.8.45లక్షలు, ఆర్జిత సేవలు, విరాళాలు తదితర మార్గాల ద్వారా కొంత ఆదాయం వచ్చింది.

సీఆర్‌పీల ఉద్యోగ భద్రతకు కృషి

ఎమ్మెల్సీ చిరంజీవిరావు ▸ భీమిలిలో ఉత్తరాంధ్ర స్థాయి సదస్సు



సదస్సును ప్రారంభిస్తు ఎమ్మెల్సీ చిరంజీవిరావు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మండల విద్యా శాఖ కార్యాలయాల్లో పనిచేస్తున్న క్లస్టర్ రీసోర్స్‌పర్సన్లకు (సీఆర్‌పీ) ఉద్యోగ భద్రతతో పాటు వేతనాల పెంపునకు కృషి చేస్తామని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు తెలిపారు. ఆదివారం అవంతి కళాశాల సమీపంలో మహారాజుపేట వద్ద ఉన్న ఫంక్షన్ హాలులో ఉత్తరాంధ్ర సీఆర్‌పీల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులను అనేక ఇబ్బందులకు గురిచేసిందని, కూటమి పాలనలో ఆ పరిస్థితి ఉండదన్నారు. సీఆర్‌పీలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పారు.సీఆర్‌పీల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల మాదిరి విధులు నిర్వహిస్తున్న తమకు వేతనాలు పెంచాలని, డీఎస్సీలో మెరిట్ కల్పించాలన్నారు. కాగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమావేశానికి హాజరు కాలేకపోవడంతో వీడియో కాల్ సందేశం ఇస్తూ సీఆర్‌పీల ఉద్యోగ భద్రత కోసం విద్యా శాఖ మంత్రితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సీఆర్‌పీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువులు, ఉత్తరాంధ్ర నాయకులు గౌరి, చిన్ని, చిరంజీవి, అనురాధ, పోలినాయుడు, లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

'మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి'



రిలే దీక్ష పాల్గొన్న మత్స్యకారులు

భీమునిపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భీమిలి నుంచి విశాఖ వరకూ తీర ప్రాంతంలో యథేచ్ఛగా జరుగుతున్న ఆక్రమణలపై అధికారులు స్పందించాలని మత్స్యకార నాయకుడు గంటా నూకరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని జోనల్ కార్యాలయం వద్ద జిల్లా మత్స్యకారుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి నాలుగో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ, ఆక్రమణలతో నిర్వహిస్తున్న రెస్టారెంట్ల ముసుగులో సాగుతున్న అసాంఘిక చర్యలపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా శ్మశాన వాటికలను ఆక్రమించి రెస్టారెంట్‌లు నిర్వహిస్తున్న వారిపై చర్యలు లేకపోవడం దారుణమన్నారు.

కమిటీలతో కాలయాపన

... 5వ పేజీ తరువాయి

తీసుకోకపోయినా బాధ్యులపై చర్యలు తీసుకోలేని స్థితిలో ఉన్నారు.

మాజీ వీసీపై విచారణ లేనట్టేనా..?

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలుత ఏయూపై దృష్టి సారిస్తారని అంతా భావించారు. అయితే ఆరు నెలలు అవుతున్నా వర్సిటీ అధికారులు, ప్రభుత్వ పెద్దలు ఏయూపై దృష్టి పెట్టలేదు. దీనిపై వర్సిటీలోని పలువురు ఉద్యోగులే రగిలిపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వర్సిటీలో అడ్డగోలు వ్యవహారాలు సాగాయని, దీనిపై అప్పట్లోనే నారా లోకేశ్, పవన్ కల్యాణ్ తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు కూడా చేశారని గుర్తుచేస్తున్నారు. ఇప్పటివరకు గత వీసీతో సహా మరికొంతమంది అధికారుల ఆగడాలపై చర్యల్లేవని ఇదే ఇప్పుడు ఎంతో మంది ఆగ్రహానికి కారణమవుతోంది. గత ప్రభుత్వంపై పోరాటం చేసిన ఎంతో మంది ప్రస్తుతం ప్రభుత్వ మెతక వైఖరిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రైల్వేలో కలకలం

... 5వ పేజీ తరువాయి

చేయాల్సిన పనులను మినహాయిస్తే మిగిలిన వాటికి సంబంధిత అధికారికి సిఫారసు చేసేవారని తెలిసింది. గత డీఆర్ఎం మాదిరిగా సిబ్బందిపై చర్యలు తీసుకోవడం, బదిలీలు చేయడం, అర్హత లేనివారికి సహకరించేవారు కాదంటున్నారు. వివిధ మార్గాల్లో ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించే వారిని కూడా డీఆర్ఎం దూరం పెట్టేవారని, కీలక అంశాల్లో ఆచితూచి నిర్ణయాలు తీసుకునేవారని సమాచారం. దీంతో కొంతమందిలో వ్యతిరేకత వచ్చిందంటున్నారు. అయితే కొందరికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చిన నేపథ్యంలో తన అనుచరులతో ఇలాంటి లావాదేవీలు జరిపి ఉంటారని మరికొంతమంది అభిప్రాయపడుతున్నారు.

ఫోర్బ్స్ మెచ్చిన తారా మండల్

... 5వ పేజీ తరువాయి

ఎంపిక చేసింది.

ఫౌండర్స్ వీరే...

ఈ స్టార్టప్‌ను 2023లో ఎ.వినీల్ జడ్సన్, డాక్టర్ డి.రాజేష్, ఎన్.రమాజయలక్ష్మి, డాక్టర్ ఎం.గౌతమ్, డాక్టర్ టి.నీలకంఠేశ్వరరెడ్డి ఏర్పాటుచేయగా, కొన్నాళ్లుగా స్టార్టప్‌కు ఏయూ ప్రొఫెసర్ పి.మల్లికార్జునరావు మెంటార్‌గా వ్యవహరిస్తున్నారు. ఫోర్బ్స్ గుర్తింపుతో కంపెనీకి అంతర్జాతీయంగా పెట్టుబడులకు అవకాశం ఏర్పడుతుందని చెబుతున్నారు. ఈ గుర్తింపు పట్ల ఫౌండర్స్ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

AJC CLASSIFIEDS

WANTED / కావలెను
BEAUTICIANS
బ్యూటీషియన్ కోర్స్ చేసి
కనీసం ఒక సంవత్సరం అనుభవం గల
విశాఖపట్నంలోని పెదవాల్తేరు ప్రాంతంలో
పనిచేయుటకు కావలెను. ఆసక్తి గల వారు సంప్రదించండి.
9941840999/9941830999

PLOTS FOR SALE

▸ VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం బెంజిసర్కిల్‌కి 5 కిమీ, బందరు రోడ్డు, నున్న నూజివీడు రోడ్డు, కంచికచర్లలో DTCP, APCRDA ప్లాట్స్ చ.గ. 1900/- నుండి 12,900/- ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్. సంప్ర.78934 21245 AJB_92

CHANGE OF NAME

★ నా పేరు గుర్రం సౌమ్య రూప, W/o గుర్రం అయ్యప్ప, 8-130, మయూరిలేన్, ఆర్.హెచ్.కాలనీ, పెదమాదక, అగనంపూడి, విశాఖపట్నం. భవిష్యత్తులో అన్ని ప్రయోజనాల కోసం నా పేరును గుర్రం సౌమ్య రూపాదేవి వినాయక్ గా మార్చుకున్నానని ఇందు మూలంగా ప్రకటిస్తున్నాను. AJH-1084

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093

6న గాయనీ సునీత మ్యూజికల్ మిస్ట్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సునీత, తదితరులు

మహారాణిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సాగర తీరంలో డిసెంబరు ఆరో తేదీన 'లైవ్ ఇన్ మ్యూజిక్ కాన్సెర్ట్' పేరిట మ్యూజికల్ మిస్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రముఖ సినీ నేపథ్య గాయకురాలు సునీత తెలిపారు, ఆదివారం హోటల్ గ్రాండ్ బేలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ విశాఖతో తనకు ఎనలేని అనుబంధం ఉందన్నారు. సాగర తీరంలో మంచి మ్యూజిక్ సిస్టమ్‌తో లైవ్ మ్యూజిక్ కాన్సెప్ట్ నిర్వహించాలని కోరిక ఉండేదని.. ఇప్పుడు అది నెరవేరేలా విశాఖకు చెందిన నటుడు నిఖిల్ విజయేంద్ర సింహా ఆధ్వర్యంలో ప్రిజమ్ సంస్థ భాగస్వామ్యంతో ఆరో తేదీన ఎంజీఎం గ్రౌండ్‌లో సంగీతప్రియులను మంత్రముగ్ధుల్ని చేసేలా మ్యూజికల్ మిస్ట్ ఉంటుందన్నారు.ఈ కార్యక్రమం ఈవెంట్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచిపోతుందని, దీనికి ఎవరూ మిస్ కావద్దని సునీత కోరారు.

మద్దిలో మహా నారాయణ సేవ

పద్మనాభం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది ధర్మశాస్తా పీఠంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. గత నెల 20 నుంచి అయ్యప్ప, శివస్వామి, భవానీ మాలాధారులకు దాతల సహకారంతో మహా నారాయణ సేవ చేస్తున్నారు. ఆదివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని వీఎం ఆర్‌డీఏ మాజీ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు దంపతులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ధర్మశాస్తా పీఠం కార్యదర్శి బుగత సత్యనారాయణ, తెలుగు యువత మండల అధ్యక్షుడు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బాందేవుపురంలో భగవద్గీతపై ప్రచారం

పద్మనాభం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బాందేవుపురంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సభ్యులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఆచార్య ప్రబోధానంద రాసిన ఆధ్యాత్మిక గ్రంథాలు, అందులో ఉన్న సారాంశాన్ని వివరించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

భీమునిపట్నం/సింహాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళా సాహితి అధ్యక్షుడు పీఆర్‌పీ వర్మ, ఎంఎఫ్‌యూపీ స్కూల్ ఉపాధ్యాయుడు సత్యనారాయణ, అప్పలరాజు, గ్రంథాలయాధికారి మహేశ్, పాల్గొన్నారు.అలాగే అడివివరం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు 'చదవటమంటే మాకిష్టం' అన్న అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాత గాజువాకకు చెందిన సీహెచ్ చెంచయ్య అచ్యుతాపురం నుంచి గాజువాక వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగ ఆయనను చెక్‌పోస్టు వద్ద ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఢీకొన్నాడు. దీంతో ఆయన కిందపడి గాయాలపాలవ్వడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ ఆయన స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామకంఠ స్థలాలను కాపాడుకుందాం

మల్కాపురం, నవంబరు 17: మల్కాపురం గ్రామ కంఠ స్థలాల అక్రమణలపై గ్రామ కమిటీ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకాశనగర్ ఏడుగుళ్లు వద్ద ఆదివారం ఉదయం జరిగిన గ్రామ కమిటీ ప్రతినిధుల సమావేశంలో గౌరవాధ్యక్షుడు భోగవిల్లి నాగభూషణం మాట్లాడుతూ గ్రామకంఠ స్థలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ఇటీవల కాలంలో కొంతమంది స్థలాలను ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపట్టేందుకు యత్నిస్తున్నారని, వారు ఆ యత్నాలను వీడకుంటే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. అరుంధతి సంఘం వెనక ఉన్న కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమావేశంలో గ్రామ కమిటీ పెద్దలు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'సర్వహిత' పింఛన్లు పంపిణీ

అగనంపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులైన 65 మందికి ప్రతినెలా మాదిరిగానే ఆదివారం ఒక్కొక్కరికి రూ.200 చొప్పున పింఛన్లు అందజేశారు. అలాగే ఓ పేద విద్యార్థికి ఫీజు నిమిత్తం రూ.మూడు వేలను అందజేశారు. అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు గుదే సుశీలగజేంద్రరరావు, పట్టా రామఅప్పారావు, నరసింగరావు, మస్తాన్‌రెడ్డి, జామి గణేశ్, జి.వెంకటరమణ, వరలక్ష్మి, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీబీఎల్‌లో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



వ్రతాలలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక వేదికపై సత్యనారాయణస్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన వేదపండితులు సుమారు వంద మంది దంపతులతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. పూజల్లో అధిక సంఖ్యలో భక్తులతో పాటు పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడి, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
● **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
● **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో:** లిఖిత (శ్రీహరిపురం)
● **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
● **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
● **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 28, వంకాయలు (తెలుపు) 56, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 28, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 30, క్యారెట్ 62 దొండకాయలు 30, బంగాళదుంపలు 40, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 50, మునక్కాడలు (కిలో) 74, బరబాటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 50, కీరదోస 28, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 32, కంద 66, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, మామిడి కాయలు 100, తోటకూర (కట్ట) 4, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	92
ఫారం ధర	112
విత్ స్కిన్	194
స్కిన్‌లెస్	204



పార్కులో నిర్మాణంలో ఉన్న స్కేటింగ్ రింక్



రూపుదిద్దుకుంటున్న వాటర్ ఫౌంటెయిన్

చకచకా పార్కు నిర్మాణం

» రూ.10 కోట్ల వ్యయంతో 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో చురుగ్గా సాగుతున్న పనులు

» మార్చి నెలాఖరు నాటికి ప్రారంభించేందుకు జీవీఎంసీ అధికారుల సన్నాహాలు

పెదగంట్యాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు పరిధి హౌసింగ్ బోర్డు కాలనీలో సుందరమయమైన పార్కు త్వరలో అందుబాటులోకి రానున్నది. ఇందుకు సంబంధించిన పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ పార్కు నిర్మాణం పూర్తయితే పారిశ్రామిక ప్రాంతానికే ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చెప్పవచ్చు. సకల వసతులతో హౌసింగ్ బోర్డు కాలనీని ఆనుకుని నిర్మితమవుతున్న ఈ పార్కు బాబూజగ్జీవన్‌రామ్ కాలనీ, బాలచెరువు, నడుపూరు, బర్మాకాలనీలకు అతి చేరువగా ఉంది.

సుమారు ఐదున్నర ఎకరాల్లో పది కోట్ల రూపాయల వ్యయంతో దీనిని నిర్మిస్తున్నారు. ఏడాది క్రితం ఈ పార్కు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పార్కుకు చుట్టూ ప్రహరీ గోడను ఏర్పాటు చేశారు. లోపల చుట్టూ గార్డెన్, చిల్డన్ ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లే ఎక్విప్‌మెంట్, హంపీ థియేటర్, వాటర్ ఫౌంటెయిన్, వాకింగ్ ట్రాక్, మాక్ క్రికెట్ కోర్టు, క్యాంటీన్, తదితరమైని ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా గార్డెన్స్‌కు, పార్కులోని ఇతర నీటి అవసరాలకు గాను స్టీల్ ప్లాంట్ కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ప్రత్యేక వాటర్ పైపులైన్లను ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి పార్కును ప్రారంభించాలని జీవీఎంసీ అధికారులు నిర్ణయించారు. అంతేకాక ఈ పార్కుకు అల్లూరి సీతారామరాజు పేరును ఖరారు చేశారు. కాగా జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు సంబంధిత ఇంజనీర్లతో ఆదివారం పార్కు నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, త్వరితంగా పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. వాటర్ పైపులైన్ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని గంధం శ్రీనివాసరావు సూచించారు.



సిద్ధం చేస్తున్న చిన్నారుల క్రీడా పరికరాలు



నిర్మాణ పనులకు అధికారులకు సూచనలిస్తున్న టీడీపీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు



వేపగుంటలో చేపట్టిన కార్యక్రమంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ



74వ వార్డులో సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీడీపీ నాయకులు

కార్యకర్తలను కుటుంబంలా చూసేది టీడీపీనే..

సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ

వేపగుంట నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం సభ్యత్వ నమోదు తీసుకున్న కార్యకర్తలందరినీ కుటుంబంలా చూసుకునే పార్టీ టీడీపీ మాత్రమేనని పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. వేపగుంటలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. సభ్యత్వం తీసుకునే ప్రతిఒక్కరికీ ప్రమాద భీమాతో పాటు ఒకవేళ మృతి చెందితే దహన ఖర్చులకు నగదు చెల్లించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన పార్టీ టీడీపీయేనని పేర్కొన్నారు. నియోజకవర్గంలో భారీ స్థాయిలో సభ్యత్వ నమోదు చేపట్టాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన సూచించారు. ప్రజా సంక్షేమమే సీఎం చంద్రబాబు ధ్యేయమన్నారు. అనంతరం పలువురితో సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, నాయకులు మామిడి కిరణ్, గంట్ల దేముడు, సూరిబాబు, సిద్ధు, అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

74వ వార్డులో..

గాజువాక: తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో జీవితానికి భరోసా అని పలువురు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. 74వ వార్డులో ఆదివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. ప్రజలకు మంచి చేయడమే చంద్రబాబు లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పల్లా రమణ, వియ్యపు కొండబాబు, జాజుల గంగరాజు, దువ్వి శ్రీను, వియ్యపు అప్పలనాయుడు, వెంకినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

76వ వార్డులో..

పెదగంట్యాడ: అత్యధికంగా సభ్యత్వ నమోదు చేసి టీడీపీ బలాన్ని పెంచాలని జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు కోరారు. సంజీవగిరి కాలనీలో ఆయన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. టీడీపీ సభ్యత్వం ద్వారా చేకూరే మేలును ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి నూకరాజు, రట్టి వాసు, చౌదరి ఉమ, గంధం నాగేశ్వరరావు, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీలా శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

మనసున్న మనిషి పీలా: ఎమ్మెల్యే పంచకర్ల
కాబోయే మేయర్ శ్రీనివాసరావు: గండి బాబ్జీ

పెందుర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్, 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను ఆదివారం పెందుర్తిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీలా యువసేన, పార్టీ కార్యకర్తలు శ్రీనివాసరావు స్వగృహంలో ఏర్పాటు చేసిన పుట్టినరోజు వేడుకలకు పెందుర్తి, మాడుగుల ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తిలతో పాటు టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, తదితరులు హాజరై పీలా శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ కార్యకర్తలు, పీలా అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకును పీలా శ్రీనివాస్‌తో బండారు సత్యనారాయణ కట్ చేయించారు. పీలాతో కేక్‌ను పంచకర్ల, గండి బాబ్జీలు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ మంచి మనసున్న మనిషి పీలా శీనివాసరావు అని, ప్రజాసేవలో రాజీ పడని తత్వం ఆయన సొంతమని కొనియాడారు. భవిష్యత్తులో పీలా మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. గండి బాబ్జీ మాట్లాడుతూ పీలా శ్రీనివాస్ త్వరలో నగర మేయర్ అవుతారని జోస్యం చెప్పారు. ఇందుకు పార్టీ కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేస్తుందన్నారు.

అనంతరం పీలా యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే బండారు ప్రారంభించారు. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు విచ్చేసి గజమాలతో పీలాను సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. అంతకుముందు శ్రీనివాసరావు వెంకటాద్రి ఆలయానికి విచ్చేసి శ్రీవారిని దర్శించుకుని పూజలు చేశారు. లయోలా వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కార్పొరేటర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పీలాతో కేక్ కట్ చేయిస్తున్న బండారు..పక్కన శ్రీనివాసరావుకు కేక్ తినిపిస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు, గండి బాబ్జీ





రథోత్సవంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు. (ఇన్‌సెట్లో) రథంలో కొలువుదీరిన స్వామి

వైభవంగా అయ్యప్ప స్వామి రథోత్సవం

ఆటోనగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు పరిధి డ్రైవర్స్ కాలనీలో గణేశ్ పీఠం ఆధ్వర్యంలో ఆదివారం వందలాది మంది అయ్యప్ప భక్తుల పేడతుళ్లి ఆట సంబరాలు, నృత్యాలతో అయ్యప్ప స్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రథోత్సవం డ్రైవర్స్ కాలనీ, చట్టివానిపాలెం, ఎల్‌బీఎస్ నగర్, టీవీఎస్ కాలనీ, ఎల్‌వీ నగర్‌ల మీదుగా సాగింది. అయ్యప్ప స్వామి భజన గీతాలకు మాలధారులు నాట్యాలు చేస్తూ భక్తి పారవశ్యంలో మునిగితేలారు. వంశీస్వామి శివునిగా వేషధారణలో చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గురుస్వామి గణేశ్ మాట్లాడుతూ రథోత్సవంతో పాటు పేడతుళ్లి ఆట సంబరాలను గత మూడేళ్లుగా నిర్వహిస్తున్నామన్నారు. భక్తుల సహకారంలో వందలాది మందికి చద్ది, భిక్షను ఏర్పాటు చేశామన్నారు. రథోత్సవంలో అధిక సంఖ్యలో స్వాములు పాల్గొన్నారు.

జయదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

మల్కాపురం, నవంబరు 17: గ్రేటర్ 60వ వార్డు పరిధి ఇందిరాకాలనీ-2లో కొండపై వెలసిన జయదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పీవీ సురేశ్ ఆలయానికి విచ్చేసి దుర్గాదేవిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు

విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు

మల్కాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే అందరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనవలసిందిగా ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు అన్నారు. మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో ఆదివారం జరిగిన మెగా డాన్స్ షోను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా నిధులను సేకరించి, వాటిని నిరుపేదల కోసం వెచ్చించడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యా సంస్థ విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

అబ్బురపరిచిన నృత్య ప్రదర్శనలు

మెగా డ్యాన్స్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ప్రదర్శించిన జానపద, గిరిజన నృత్యాలు ఆద్యంతం అందరినీ ఆకట్టుకున్నాయి. సుమారు 200 మందికి పైగా ఈ పోటీల్లో పాల్గొనడం విశేషం. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఏయూ సంగీతం, నాట్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కేవీ విజయవేణి, ప్రముఖ నాట్య అధ్యాపకురాలు మీనా, కొరియోగ్రాఫర్ మధు వ్యవహరించారు. ఈ పోటీల్లో కళాశాలకు చెందిన బీకామ్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు ప్రథమ స్థానంలో, తృతీయ సంవత్సర విద్యార్థులు ద్వితీయ, బీఎస్సీ సెకండియర్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రేమకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా ఫుడ్ ఫెస్టివల్‌ను అధ్యాపకులు, విద్యార్థులు చేపట్టారు. సాంస్కృతిక ప్రదర్శనలు, ఫుడ్ ఫెస్టివల్ ద్వారా వచ్చిన నిధులను సేవా కార్యక్రమాల కోసం వినియోగిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.



ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

» శతశాతం హెల్మెట్ ధారణకు చర్యలు

» త్వరలో రోడ్డు ట్రాఫిక్ విక్టిమ్ అసిస్టెంట్ సెల్ ఏర్పాటు

» పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసు సిబ్బంది పని చేయాలని, అందుకు ప్రజలు కూడా సహకరించాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. ఆదివారం ఏయూ వైవీఎస్ ఆడిటోరియంలో నగర ట్రాఫిక్ విభాగం, రోడ్డు సేఫ్టీ అండ్ ఫైర్ సేఫ్టీ రోటరీ డిస్ట్రిక్ సంయుక్తంగా ప్రపంచ రోడ్డు బాధితుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నియామాలు పాటించడం వల్లే రోడ్డు ప్రదామాలు నివారించగలమన్నారు. సెప్టెంబరు నుంచి ప్రతీ ఒక్కరు కచ్చితంగా నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టగా ఆ నెల రోడ్డు ప్రమాద మరణాలు 32 నుంచి 19కి తగ్గాయని వెల్లడించారు.

తాను ఇక్కడ కమిషనర్‌గా చేరినప్పుడు 10 శాతం మాత్రమే హెల్మెట్ ధరించేవారని, ఇప్పుడు అది 50 శాతానికి చేరిందని, శత శాతం చేయడమే తన లక్ష్యమన్నారు. నగరంలో నూతనంగా ఏఐ డ్రైవన్ ప్రాజెక్టు ప్రారంభిస్తామని, దీని ద్వారా హెల్మెట్ ధరించకపోయినా, రహదారి నిబంధనలు పాటించకపోయినా నేరుగా ఇంటికే చలానా పంపడం జరుగుతుందన్నారు. ఒక్కరు కూడా రోడ్డు ప్రమాదంలో మృతిచెందకూడదనే లక్ష్యంతో పని చేస్తామన్నారు. ఎక్కడ లేని విధంగా రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందేలా రోడ్డు ట్రాఫిక్ విక్టిమ్ అసిస్టెంట్ సెల్ కూడా త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు ట్రాపిక్ నియమాలు, జాగ్రత్తలు అవగాహన కల్పించారు.

అంతకుముందు.. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, పోలీసు ఉన్నతాధికారులు, ఎన్జీవో సంస్థల నిర్వాహకులు కొవ్వొత్తులు చేత పట్టుకొని నగరంలోని రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని పోలీసు కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ప్రమాదాల్లో మరణించిన వారి కారణంగా జరిగిన నష్టాన్ని, బాధలతో కలిగిన అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 అజిత వెజెండ్ల, ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీన్‌కుమార్, రోడ్డు సేఫ్టీ అండ్ ఫైర్ సేఫ్టీ రోటరీ డిస్ట్రిక్ చైర్మన్ బాలసతీష్, ఏయూ విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం పోస్టర్లు ఆవిష్కరణ

గాజువాక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న మరో ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో జనవరి ఐదున గాజువాకలో నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరానికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఆయన కర్ణవానిపాలెంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని, రక్తదానంపై అపోహలను విడనాడాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సూర్యనారాయణరెడ్డి, వినోద్‌బాబు, జాగరపు శ్రీను, త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం గ్రంథాలయంలో సాహిత్య సమ్మేళనం

గోపాలపట్నం, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా ఆదివారం సాహిత్య సమ్మేళనాన్ని నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గోపాలపట్నం కళా సేవా పీఠం ప్రతినిధులు కళల అభ్యున్నతికి తీసుకోవల్సిన అంశాలపై ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో కళలకు ఆదరణ కరువైందని, పాఠశాల స్థాయి నుంచి కళలను ప్రోత్సహించడం వల్ల అంతరించిపోతున్న కళలు జీవం పోసుకుంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వక్తలు దామరాజు విశాలాక్షి, సంజీవ్‌కుమార్, ఎన్‌వీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడలో కవి సమ్మేళనం

పెదగంట్యాడ: కవులు రచయితలు చేసే రచనలు సమాజానికి సవ్యదిశ చూపేవిగా ఉండాలని సాహిత్యసుధ వ్యవస్థాపకులు, ప్రముఖ రచయిత అద్దంకి రాఘవాచార్యులు అన్నరు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కవిసమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ మంచి, చెడులను విశ్లేషించి వాటికి సాహిత్యాన్ని జోడించి చెడుపై మంచే విజయం సాధించే అంశాలను సమాజానికి ఉద్భోదించాలన్నారు. కార్యక్రమంలో రచయిత ఏవీఎన్‌ఎల్ అప్పారావు, గ్రంథాలయాధికారి వీవీ రమణ, విశ్రాంత గ్రంథాలయాధికారి అమ్మాజీ, ఉపాధ్యాయులు విఠల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు మ్యూజికల్ చైర్, పేపర్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు.

పెందుర్తిలో వక్తృత్వ పోటీలు

పెందుర్తి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. చదవడం మాకిష్టం, శారీరక శుభ్రత అంశాలపై పోటీలు చేపట్టి విజేతలకు బహుమతులు అందజేశారు గ్రంథాలయ కమిటీ సభ్యులు, పాఠకులు పాల్గొన్నారు.

'కార్మిక సమస్యల పరిష్కారం కోసం రాజీ లేని పోరు'

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యల పరిష్కారం కోసం రాజీ లేని పోరాటాలు చేస్తున్నామని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం ముందు కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఉంచామని, వాటిని తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన చేస్తామన్నారు. ప్లాంట్‌లో బలమైన కార్మిక సంఘంగా ఉంటూ కార్మికుల పక్షాన తాము నిలుస్తున్నామన్నారు. కార్మికులకు అన్యాయం జరిగినా, ప్లాంట్ జోలికొచ్చినా సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

సింధియా, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం పురవీధుల్లో గౌరీదేవి సారె ఊరేగింపును చేపట్టారు. కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బుద్దా శివాజీ, ఎస్.గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

79, 85 వార్డుల్లో బీజేపీ సభ్యత్వ నమోదు

అగనంపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79, 85వ వార్డుల్లో ఆదివారం బీజేపీ స్థానిక నాయకులు సభ్యత్వ నమోదును చేపట్టారు. అగనంపూడిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బొండా యల్లాజీరావు మాట్లాడుతూ దేశాభివృద్ధి తమ పార్టీతోనే సాధ్యమన్నారు. యువత బీజేపీలో చేరి దేశాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోసూరి తాతారావు, బాబూరావు, శంకరరావు, కుమారి, రవీంద్రకుమార్, రేఖ, శిరీష, ఆశాలత, తదితరులు పాల్గొన్నారు.

'కోరమాండల్' ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

మల్కాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా 58వ వార్డు పరిధి పిలకవానిపాలెంలో కోరమాండల్ ఎరువుల కర్మాగారం ఆదివారం ఉదయం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా శిబిరాన్ని ప్రారంభించిన కోరమాండల్ సంస్థ డీజీఎం (హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తాము సామాజిక సేవలో భాగంగా ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. శిబిరంలో స్త్రీ వైద్య నిపుణలు, పిల్లల వైద్య నిపుణులు, మానసిక, కీళ్ల, దంత, క్యాన్సర్ వైద్య నిపుణులు పాల్గొని సేవలందించారు. కార్యక్రమంలో సంస్థ చీఫ్ సెక్యూరిటీ అధికారి నారాయణ పాత్రుడు, సేఫ్టీ విభాగం అధికారి కె.నాగరాజు, సీనియర్ మేనేజర్ శ్రీకాంత్, సీఎస్ఆర్ మేనేజర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ రన్నరప్‌గా విశాఖ

జాతీయ టోర్నీకి నలుగురు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న సింహాద్రినాయుడు

విశాఖపట్నం, స్పోర్ట్సు, నవంబరు (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్-19 బాలుర ఫుట్‌బాల్ టోర్నీలో విశాఖ జట్టు రన్నరప్ ట్రోఫీని సాధించింది. గుంటూరులో జరిగిన ఈ టోర్నీలో అద్భుతంగా రాణించిన సీహెచ్ దుర్గాప్రసాద్ (ఏవీఎన్ కాలేజి), వి.శ్రవంత్ (బుల్లయ్య కాలేజి), బి.మన్యుష్ సాయిచంద్ర (యూఎన్ అకాడమీ), సీహెచ్ సందీప్ (జెడ్పీ హైస్కూల్) జాతీయ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏవీఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు, ఫిజికల్ డైరెక్టర్ ఎస్.గోపీకృష్ణ జాతీయ టోర్నీకి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

మతిస్థిమితం లేని మహిళ వృద్ధాశ్రమానికి అప్పగింత



మహిళను వృద్ధాశ్రమ నిర్వాహకులకు అప్పగిస్తున్న ఎయిర్‌పోర్ట్ పోలీసులు

మర్రిపాలెం నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఏడీ సమీపంలోని కాకానినగర్ రోడ్డుపై తిరుగుతున్న మతిస్థిమితం లేని వృద్ధురాలిని విశాఖ పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ గమనించి ఆమెను వృద్ధాశ్రమానికి తరలించాలంటూ ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావును ఆదేశించారు. దీంతో ఆమెను ఎయిర్‌పోర్టు పోలీసులు పెందుర్తిలో గల లోయలా వృద్ధాశ్రమ నిర్వాహకులకు అప్పగించారు.

అలరించిన పరంపర నృత్యోత్సవం

పెదవాల్తేరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సంప్రదాయ కళారూపాలను పరిరక్షణ ఉద్దేశంతో పరంపర ఫౌండేషన్, ప్రసిద్ధ స్టెమ్ డాన్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఎంజీఎం పార్కులో నిర్వహించిన నృత్యోత్సవం ఆహూతులను మంత్రముగ్ధులను చేసింది. పురాణ గ్రంథాలను ప్రేరణగా తీసుకుని, సంప్రదాయ, ఆధునిక ప్రభావాల సమన్వయాన్ని ప్రతిబింబించే విధంగా నృత్యకారులు చేసిన ప్రదర్శన అందరినీ అలరించింది.ఇండియా-కో ఎగ్జిస్టింగ్ విత్ ట్రెడిషన్ అండ్ మోడర్నిటీ పేరిట నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ హెచ్ఎన్ హరేంధర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి విచ్చేసి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, తదితరులు



నృత్యోత్సవంలో కళాకారుల ప్రదర్శన



కళాకారుల నృత్యాభినయం

కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతర్జాతీయ ప్రసిద్ధి గాంచిన ప్రముఖ నృత్యకారుడు మధునటరాజ్ పర్యవేక్షణలో సాగిన నృత్యప్రదర్శన వినూత్నంగా సాగింది.

ఈ సందర్భంగా పరంపర ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ నాగి బి.రావు, శశిరెడ్డి మాట్లాడుతూ సంప్రదాయ కళలు ఆధునిక కాలంలోనూ ఎలా ప్రాముఖ్యత సంతరించుకుంటున్నాయో ప్రజలకు తెలియడం తమ లక్ష్యమన్నారు. ఆలయాలు, కోటలు, వంటి ప్రదేశాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా కళాపరిరక్షణ, వారసత్వ సంరక్షణకు పరంపర ఫౌండేషన్ ద్వారా కృషి చేస్తున్నట్టు వివరించారు. ఈ ప్రదర్శనలు ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో భారతీయ కళలను ప్రోత్సహించే తమ ఫౌండేషన్ గతంలో అనేక ప్రశంసలు అందుకున్నదని వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో పార్వతీపరమేశ్వరుల కల్యాణం



పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

సీతమ్మధార, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మధారలో గల వేద ధర్మ రక్షణ సభ సమావేశ మందిరంలో భక్తిశ్రద్ధలతో పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. చాగంటి సత్‌సంగ్ ఆధ్వర్యంలో సత్యనారాయణ వ్రతం, పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని చేపట్టారు. లోకకళ్యాణార్థం పార్వతీపరమేశ్వరులు కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్టు సత్ సంఘం ప్రతినిధులు రామాచార్యులు తెలిపారు. లోకకల్యాణార్థం, భగవత్ ఆశీస్సులు పొందే వీలుగా పారతీశ్వర కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సత్‌సంఘ్ ప్రతినిధులు రామాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో 20 మంది దంపతులు, అంధులు పాల్గొని పూజలు చేశారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న చిన్నారులు

మురళీనగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మురళీనగర్ ప్రభుత్వ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం 4వ రోజు కార్యక్రమంలో భాగంగా ధరావత్తు సేకరణ కార్యక్రమం చేపట్టారు. లైబ్రరీలో కొత్త మెంబర్ షిప్‌లను ప్రోత్సహిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్టు లైబ్రేరియన్ పద్మజ తెలిపారు. అనంతరం పుస్తక పఠనంపై ఆసక్తి కలిగేలా బాలలకు 'లవ్ బుక్ రీడింగ్ ' ప్రోగ్రామ్ చేపట్టారు. నేటి తరం పిల్లలు, విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి కనబరిచేలా ప్రోత్సహించడంతో పాటు ఎల్లవేళలా ఏ సందేహం వచ్చినా స్మార్ట్ సెల్‌లోనే సెర్చ్ చేయాలన్న ఆలోచన కాకుండా ప్రధానంగా లైబ్రరీకి వచ్చేలా అలవాటు చేయడం ప్రధానంగా తల్లిదండ్రులు బాలలకు అలవాటు చేయాలని లైబ్రేరియన్ కోరారు. కార్యక్రమంలో మురళీనగర్ నివాసితులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ వరప్రసాద్‌కు సన్మానం

మాధవధార, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీ కళింగ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమితులైన 50వ వార్డు టీడీపీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్‌ను ఆదివారం ఉమ్మడి విశాఖ జిల్లా రజక సంఘం ప్రతినిధులు సత్కరించారు. సంఘం అధ్యక్షుడు తోకాడ రాము అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు కె.సత్యరాజ్, జైనాథ్, ఎ.శ్రీను తదితరులు వరప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.



వరప్రసాద్‌ను సత్కరిస్తున్న విశాఖ జిల్లా రజక సంఘం ప్రతినిధులు

రామలింగేశ్వరాలయంలో సంగీత కచేరి

అక్కయ్యపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయంలో శాస్త్రీయ సంగీత విద్వంసురాలు జి.సూర్యశ్రీ ఆధ్వర్యంలో సంస్కృతి పాఠశాల విద్యార్థులు ఆదివారం సంగీత కచేరి నిర్వహించారు.

2 నుంచి కనకమహాలక్ష్మి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు

ఆన్‌లైన్లో ప్రత్యేక పూజల టికెట్ల విక్రయం

దేవస్థానం ఈవో కె.శోభారాణి



జగదాంబ కూడలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వన్ టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో డిసెంబరు 2 నుంచి 30 వరకు మార్గశిర మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు ఈవో కె.శోభారాణి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆదివారం ప్రత్యేక పూజలు, టికెట్ల విక్రయాలపై వివరాలను వెల్లడించారు. మార్గశిర ప్రత్యేక పూజల్లో పాల్గొనదలచని భక్తులు పూజలకు సంబంధించిన టికెట్లను దేవస్థానం వెబ్‌సైట్, యూనియన్ బ్యాంకు ద్వారా పొందవచ్చునన్నారు. ప్రతి గురువారం నిర్వహించే పంచామృతాభిషేకానికి రూ.7,500, మిగిలిన రోజుల్లో ఇదే కార్యక్రమానికి రూ.2,500 టికెట్ నిర్ణయించామన్నారు. శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేకం సేవకు రూ.1,116 టికెట్ తీసుకోవాలన్నారు. భక్తులు ముందుగానే టికెట్లు పొందే వీలుందని, ఇందుకోసం www.aptemples. gov.in అదేవిధంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మెయిన్ రోడ్డు, విశాఖపట్నం అకౌంట్ నెంబరు 0608 100 11006691 ఐఎఫ్‌సీ కోడ్ యుబీఐఎన్ 080608కు ఆన్‌లైన్ ద్వారా డబ్బును ట్రాన్స్‌ఫర్ చేసి పూజా వివరాలు, గోత్రనామాలు, పూర్తి చిరునామాను idendo. eokanaka.gov.in ద్వారా పంపాలన్నారు.

రైల్వేలో కలకలం

... 5వ పేజీ తరువాయి

చేయాల్సిన పనులను మినహాయిస్తే మిగిలిన వాటికి సంబంధిత అధికారికి సిఫారసు చేసేవారని తెలిసింది. గత డీఆర్ఎం మాదిరిగా సిబ్బందిపై చర్యలు తీసుకోవడం, బదిలీలు చేయడం, అర్హత లేనివారికి సహకరించేవారు కాదంటున్నారు. వివిధ మార్గాల్లో ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించే వారిని కూడా డీఆర్ఎం దూరం పెట్టేవారని, కీలక అంశాల్లో ఆచితూచి నిర్ణయాలు తీసుకునేవారని సమాచారం. దీంతో కొంతమందిలో వ్యతిరేకత వచ్చిందంటున్నారు. అయితే కొందరికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చిన నేపథ్యంలో తన అనుచరులతో ఇలాంటి లావాదేవీలు జరిపి ఉంటారని మరికొంతమంది అభిప్రాయపడుతున్నారు.

కమిటీలతో కాలయాపన

... 5వ పేజీ తరువాయి

తీసుకోకపోయినా బాధ్యులపై చర్యలు తీసుకోలేని స్థితిలో ఉన్నారు.

మాజీ వీసీపై విచారణ లేనట్టేనా..?

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలుత ఏయూ పై దృష్టి సారిస్తారని అంతా భావించారు. అయితే ఆరు నెలలు అవుతున్నా వర్సిటీ అధికారులు, ప్రభుత్వ పెద్దలు ఏయూపై దృష్టి పెట్టలేదు. దీనిపై వర్సిటీలోని పలువురు ఉద్యోగులే రగిలిపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వర్సిటీలో అడ్డగోలు వ్యవహారాలు సాగాయని, దీనిపై అప్పట్లోనే నారా లోకేశ్, పవన్ కల్యాణ్ తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు కూడా చేశారని గుర్తుచేస్తున్నారు. ఇప్పటివరకు గత వీసీతో సహా మరికొంతమంది అధికారుల ఆగడాలపై చర్యల్లేవని ఇదే ఇప్పుడు ఎంతో మంది ఆగ్రహానికి కారణమవుతోంది. గత ప్రభుత్వంపై పోరాటం చేసిన ఎంతో మంది ప్రస్తుతం ప్రభుత్వ మెతక వైఖరిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఫోర్బ్స్ మెచ్చిన తారా మండల్

... 5వ పేజీ తరువాయి

ఎంపిక చేసింది.

ఫౌండర్స్ వీరే...

ఈ స్టార్టప్‌ను 2023లో ఎ.వినీల్ జడ్సన్, డాక్టర్ డి.రాజేష్, ఎన్.రమాజయలక్ష్మి, డాక్టర్ ఎం.గౌతమ్, డాక్టర్ టి.నీలకంఠేశ్వరరెడ్డి ఏర్పాటు చేయగా, కొన్నాళ్లుగా స్టార్టప్‌కు ఏయూ ప్రొఫెసర్ పి.మల్లికార్జునరావు మెంటార్‌గా వ్యవహరిస్తున్నారు. ఫోర్బ్స్ గుర్తింపుతో కంపెనీకి అంతర్జాతీయంగా పెట్టుబడులకు అవకాశం ఏర్పడుతుందని చెబుతున్నారు. ఈ గుర్తింపు పట్ల ఫౌండర్స్ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



విజేతలతో గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, తదితరులు

క్రికెట్ టోర్నమెంట్ విజేతలు బహుమతులు అందజేత

జగదాంబ కూడలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, పార్టీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ బహుమతులు అందజేశారు. ఆదివారం ఆంధ్ర మెడికల్ కళాశాలలో జరిగిన ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ పోటీలు ఎంతో సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా గండి బాబ్జీ మాట్లాడుతూ యువతరం క్రీడల పట్ల ఆసక్తి చూపుతుండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. నిర్వాహకులను ఆయన అభినందనలు తెలిపారు.

దివ్యాంగులకు పెట్రోల్ రాయితీకి దరఖాస్తులు ఆహ్వానం

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సొంతంగా మూడు చక్రాల వాహనం ఉండి, ఏదైనా వ్యాపారం లేదా గుర్తింపు కలిగిన ప్రైవేటు సంస్థలో పని చేస్తున్న దివ్యాం గులకు పెట్రోల్ రాయితీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు జె. మాధవి తెలిపారు. ఈమేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు వాహనాలు కలిగిన వారికి నెలకు 15 లీటర్లు, రెండు హార్స్‌పవర్ కంటే ఎక్కువ ఉన్న వాహనాలు కలిగిన వారికి 25 లీటర్ల వరకు మంజూరు చేస్తామన్నారు. అర్హులైన వారు దరఖాస్తుతో పాటు సదరం సర్టిఫికెట్, తెల్ల రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్, వ్యాపారం లేదా సంస్థలో పని చేస్తున్నట్టు ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, పెట్రోల్ కొనుగోలు చేసిన రశీదులు, అపెండెక్స్-బిలో పెట్రోల్ బంక్ డీలర్‌తో సంతకం చేసి జత చేయాలన్నారు. దరఖాస్తులను ఈనెల 30వ తేదీలోగా పెదవాల్తేరులోని రాణి చంద్రమణిదేవి ఆస్పత్రి ఆవరణలో ఉన్న తమ కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

విశాఖ కార్మిక సమస్యల పరిష్కారం కోసం 21 నుంచి నిరాహార దీక్షలు

ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 17: విశాఖ డెయిరీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21 నుంచి నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు అన్నారు. ఆదివారం గాజువాకలో జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతు డెయిరీ యాజమాన్య నిరంకుశ ధోరణి వల్ల గత 20 ఏళ్లుగా కార్మికులు తమ హక్కులను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ నెల 21 నుంచి నిరాహర దీక్షలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో నాయకులు కేవీ మూర్తి, ఎస్.రమణ, ఎం.రాంబాబు, ఎ.నరసన్న, ఎస్.త్రినాథరావు, భాస్కరరావు, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం: సీపీ



మెడికల్ క్యాంపులో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : షుగర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండా లని, ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించుకోవడం చాలా ముఖ్యమని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ఆదివారం ప్రపంచ డయాబెటిస్ డే సందర్భంగా టీపీటీ కాలనీ నివాసితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక బృందావనం పార్కులో మధు మేహ వ్యాధి ఉచిత రక్త పరీక్షలు శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం సీపీ మాట్లాడుతూ షుగర్ చాలా ప్రమాదకరమైనదని, నియమిత ఆహారం తీసుకుంటూ వ్యాయామం చేయడం ద్వారా వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చన్నారు. ప్రము ఖ వైద్యుడు దిలీప్‌కుమార్ మాట్లాడుతూ షుగర్ వ్యాధిని నిర్లక్ష్యం చేయకూడదన్నారు. నిర్లక్ష్యం చేస్తే మరింత ప్రమాదకరంగా మారుతుందన్నారు. డాక్టర్ కేబీ స్వామి మాట్లాడు తూ షుగర్ వ్యాధి కారకాలు, నివారణ, నియం త్రణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ గొర్తి ప్రసన్న, సెక్రటరీ మోహనరావు, కోశాధికారి బీవీ విజయ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం స్పందించాలి

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

డాబాగార్డెన్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు చెల్లించవలసిన 11వ పీఆర్‌సీ, డీఏ సరెండర్ లీవ్ బకాయిలు, పి.ఎఫ్, ఏపీజీఎల్ఐ తుది చెల్లింపులు, రుణాల చెల్లింపులపై ప్రభుత్వం ఇంతవరకు స్పందించలేదని తక్షణమే దీనిపై ప్రకటన చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని చంద్రాస్ హోటల్‌లో ఎస్టీయూ ఉత్తరాంధ్ర జిల్లాల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 12వ పీఆర్సీ అమలు చేయవలసిన గడువు ఇప్పటికే 17 నెలలు ఆలస్యమైందన్నారు. వెంటనే 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించి పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర భారాన్ని తగ్గిస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఆచరణలో చూపడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ మెమో నంబర్-57 మేరకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను వర్తింపజేయాల్సి ఉన్నా మీనమేషాలు లెక్కిస్తుండడం సమంజసం కాదని పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలపై ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థిక బకాయిలపై ప్రభుత్వం స్పందించకపోతే ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉద్యమానికి శ్రీకారం చుడతామని రఘునాథరెడ్డి హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి డి.శ్యామ్, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేముడు బాబు, పైడిరాజు, రమణమూర్తి, తమ్మినాయుడు, కె.జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువుల వారోత్సవాల్లో భాగంగా వాక్‌థాన్



వాక్‌థాన్‌లో పాల్గొన్న వైద్యులు, తదితరులు

మహారాణిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ నవజాతశిశు వారోత్సవాలను పురస్కరించుకుని బీచ్ రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించారు. ఆదివారం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ రెయిన్‌బో పిల్లల ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రముఖ నియోనెంటాలజిస్టులు, పిల్లల వైద్య నిపుణులతో ఆదివారం తీరంలోని కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు వరకు వరల్డ్ ప్రీ మెచ్యూర్డ్ డే వాక్‌థాన్‌ను చేపట్టారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ ఐదేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల మరణానికి ప్రధాన కారణం ప్రీ మెచ్యూర్డ్ జననమేనని అన్నారు. నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకు, బరువు తక్కువ ఉన్న పిల్లలకు ప్రత్యేక సంరక్షణ ఎంతో అవసరమని, తగిన జాగ్రత్తలు తీసుకోవలసిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోనెంటాలజిస్టులు డాక్టర్ బాలశ్రీలత, డాక్టర్ వి.సతీశ్, డాక్టర్ ఫణిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

6న తీరంలో గాయనీ సునీత మ్యూజికల్ మిస్ట్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సునీత, తదితరులు

మహారాణిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సాగర తీరంలో డిసెంబరు ఆరో తేదీన 'లైవ్ ఇన్ మ్యూజిక్ కాన్సెర్ట్' పేరిట మ్యూజికల్ మిస్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రముఖ సినీ నేపథ్య గాయకురాలు సునీత తెలిపారు. ఆదివారం హోటల్ గ్రాండ్ బేలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ విశాఖతో తనకు ఎనలేని అనుబంధం ఉందన్నారు. సాగర తీరంలో మంచి మ్యూజిక్ సిస్టమ్‌తో లైవ్ మ్యూజిక్ కాన్సెప్ట్ నిర్వహించాలని కోరిక ఉండేదని.. ఇప్పుడు అది నెరవేరేలా విశాఖకు చెందిన నటుడు నిఖిల్ విజయేంద్ర సింహా ఆధ్వర్యంలో ప్రిజమ్ సంస్థ భాగస్వామ్యంతో ఆరో తేదీన ఎంజీఎం గ్రౌండ్‌లో సంగీతప్రియులను మంత్రముగ్ధుల్ని చేసేలా మ్యూజికల్ మిస్ట్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఈవెంట్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచిపోతుందని, దీనికి ఎవరూ మిస్ కావద్దని సునీత కోరారు.

రామ్మూర్తినాయుడుకు నివాళి

మల్కాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ప్రకాశనగర్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు సంతాప సభను ఆదివారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రామ్మోహన్‌నాయుడు, నాయకులు సీతారామ్, కొరిబిల్లి రాము, జయశంకర్, పొత్తబత్తుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ కళలకు ప్రాధాన్యం ఇవ్వాలి



విజేతలను సత్కరించిన దృశ్యం

డాబాగార్డెన్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ కళలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకులు మహమ్మద్ షకీల్ ఆధ్వర్యంలో వైజాగ్ లిటిల్ చాంపియన్ టాలెంట్ పేరిట చిన్నారులకు, విద్యార్థులకు విభిన్న కళలపై సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కళలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు చదువులోనూ రాణించాలని కోరారు. సినీ దర్శకుడు ఆర్.యాద్‌కుమార్ మాట్లాడుతూ దాగివున్న ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు మహమ్మద్ తాజ్, కేవీఎస్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

CLASSIFIEDS

WANTED / కావలెను
BEAUTICIANS
బ్యూటీషియన్ కోర్స్ చేసి
కనీసం ఒక సంవత్సరం అనుభవం గల
విశాఖపట్నంలోని పెదవాల్తేరు ప్రాంతంలో
పనిచేయుటకు కావలెను. ఆసక్తి గల వారు సంప్రదించండి.
9941840999/9941830999

PLOTS FOR SALE
» VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం బెంజిసర్కిల్‌కి 5 కిమీ, బందరు రోడ్డు, నున్న నూజివీడు రోడ్డు, కంచికచర్లలో DTCP, APCRDA ప్లాట్స్ చ.గ. 1900/- నుండి 12,900/- ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్. సంప్ర. 78934 21245
AJB_92

CHANGE OF NAME
★ నా పేరు గుర్రం సౌమ్య రూప, W/o గుర్రం అయ్యప్ప. 8-130, మయూరిలేన్, ఆర్.హెచ్.కాలనీ, పెదమాదక, అగనంపూడి, విశాఖపట్నం. భవిష్యత్తులో అన్ని ప్రయోజనాల కోసం నా పేరును గుర్రం సౌమ్య రూపాదేవి వినాయక్ గా మార్చుకున్నానని ఇందు మూలంగా ప్రకటిస్తున్నాను. AJH-1084

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093

☛ సంక్షిప్తంగా..

2 నుంచి కనకమ్మ ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు

» ఆన్‌లైన్లో ప్రత్యేక పూజల టికెట్ల విక్రయం : ఈవో శోభారాణి



జగదాంబ కూడలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో డిసెంబరు 2 నుంచి 30 వరకు మార్గశిర మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు ఈవో కె.శోభారాణి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆదివారం ప్రత్యేక పూజలు, టికెట్ల విక్రయాలపై వివరాలను వెల్లడించారు. మార్గశిర ప్రత్యేక పూజల్లో పాల్గొనదలచని భక్తులు పూజలకు సంబంధించినటికెట్లను దేవస్థానం వెబ్‌సైట్, యూనియన్ బ్యాంకు ద్వారా పొందవచ్చునన్నారు. ప్రతి గురువారం నిర్వహించే పంచామృతాభిషేకానికి రూ.7,500, మిగిలిన రోజుల్లో ఇదే కార్యక్రమానికి రూ.2,500 టికెట్ నిర్ణయించామన్నారు. శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేకం సేవకు రూ.1,116 టికెట్ తీసుకోవాలన్నారు. భక్తులు ముందుగానే టికెట్లు పొందే వీలుందని, ఇందుకోసం www.aptemples. gov.in అదేవిధంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మెయిన్ రోడ్డు, విశాఖపట్నం అకౌంట్ నెంబరు 0608 100 11006691 ఐఎఫ్‌సీ కోడ్ యూబీఐఎన్ 080608కు ఆన్‌లైన్ ద్వారా డబ్బును ట్రాన్స్‌ఫర్ చేసి పూజా వివరాలు, గోత్రనామాలు, పూర్తి చిరునామాను iden-do.eokanaka.gov.in ద్వారా పంపాలన్నారు.

దివ్యాంగులకు పెట్రోల్ రాయితీకి దరఖాస్తులు ఆహ్వానం

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) :సొంతంగా మూడు చక్రాల వాహనం ఉండి, ఏదైనా వ్యాపారం లేదా గుర్తింపు కలిగిన ప్రైవేటు సంస్థలో పని చేస్తున్న దివ్యాంగులకు పెట్రోల్ రాయితీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు జె.మాధవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు హార్స్‌పవర్ వాహనాలు కలిగిన వారికి నెలకు 15 లీటర్లు, రెండు హార్స్‌పవర్ కంటే ఎక్కువ ఉన్న వాహనాలు కలిగిన వారికి 25 లీటర్ల వరకు మంజూరు చేస్తామన్నారు. అర్హులైన వారు దరఖాస్తుతో పాటు సదరం సర్టిఫికెట్, తెల్ల రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్, వ్యాపారం లేదా సంస్థలో పని చేస్తున్నట్టు ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, పెట్రోల్ కొనుగోలు చేసిన రశీదులు, అపెండెక్స్-బిలో పెట్రోల్ బంక్ డీలర్‌తో సంతకం చేసి జత చేయాలన్నారు. దరఖాస్తులనుఈ నెల 30వ తేదీలోగా పెదవాల్తేరులోని రాణి చంద్రమణి దేవి ఆస్పత్రి ఆవరణలో ఉన్న తమ కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు.

సినిమా గైడ్

- **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడి, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** లిఖిత (శ్రీహరిపురం)
- **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :**రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 28, వంకాయలు(తెలుపు) 56, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 28, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 30, క్యారెట్ 62 దొండకాయలు 30, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 50, కీర దోస 28, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 32, కంద 66, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	92
ఫారం ధర	112
విత్ స్కిన్	194
స్కిన్‌లెస్	204

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

» శతశాతం హెల్మెట్ ధారణకు చర్యలు
» త్వరలో రోడ్డు ట్రాఫిక్ విక్టిమ్ అసిస్టెంట్ సెల్ ఏర్పాటు
» పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

మద్దిలపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసు సిబ్బంది పని చేయాలని, అందుకు ప్రజలు కూడా సహకరించాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. ఆదివారం ఏయూ వైవీఎస్ ఆడిటోరియంలో నగర ట్రాఫిక్ విభాగం, రోడ్డు సేఫ్టీ అండ్ ఫైర్ సేఫ్టీ రోటరీ డిస్ట్రిక్ సంయుక్తంగా ప్రపంచ రోడ్డు బాధితుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నియామాలు పాటించడం వల్లే రోడ్డు ప్రమాదాలు నివారించగలమన్నారు. సెప్టెంబరు నుంచి ప్రతీ ఒక్కరు కచ్చితంగా నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టగా ఆ నెల రోడ్డు ప్రమాద మరణాలు 32 నుంచి 19కి తగ్గాయని వెల్లడించారు. తాను ఇక్కడ కమిషనర్‌గా చేరినప్పుడు 10 శాతం మాత్రమే హెల్మెట్ ధరించేవారని, ఇప్పుడు అది 50 శాతానికి చేరిందని, శత శాతం చేయడమే తన లక్ష్యమన్నారు. నగరంలో నూతనంగా ఏఐ డ్రివన్ ప్రాజెక్టు ప్రారంభిస్తామని, దీని ద్వారా హెల్మెట్ ధరించకపోయినా, రహదారి నిబంధనలు పాటించకపోయినా నేరుగా ఇంటికే చలానా పంపడం జరుగుతుందన్నారు. ఒక్కరు కూడా రోడ్డు ప్రమాదంలో మృతిచెందకూడదనే లక్ష్యంతో పని చేస్తామన్నారు. ఎక్కడ లేని విధంగా రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందేలా రోడ్డు ట్రాఫిక్ విక్టిమ్ అసిస్టెంట్ సెల్ కూడా త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు ట్రాఫిక్ నియమాలు, జాగ్రత్తలు అవగాహన కల్పించారు.

అంతకుముందు.. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, పోలీసు ఉన్నతాధికారులు, ఎన్జీవో సంస్థల నిర్వాహకులు కొవ్వొత్తులు చేత పట్టుకొని నగరంలోని రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని పోలీసు కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ప్రమాదాల్లో మరణించిన వారి కారణంగా జరిగిన నష్టాన్ని, బాధలతో కలిగిన అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 అజిత వెజెండ్ల, ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీన్‌కుమార్, రోడ్డు సేఫ్టీ అండ్ ఫైర్ సేఫ్టీ రోటరీ డిస్ట్రిక్ చైర్మన్ బాలసతీష్, ఏయూ విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన పరంపర నృత్యోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ హరేంధర్ ప్రసాద్ తదితరులు

పెదవాల్తేరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సంప్రదాయ కళారూపాలను పరిరక్షణ ఉద్దేశంతో పరంపర ఫౌండేషన్, ప్రసిద్ధ స్టెమ్ డాన్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఎంజీఎం పార్కులో నిర్వహించిన నృత్యోత్సవం ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది. పురాణ గ్రంథాలను ప్రేరణగా తీసుకుని, సంప్రదాయ, ఆధునిక ప్రభావాల సమన్వయాన్ని ప్రతిబింబించే విధంగా నృత్యకారులు చేసిన ప్రదర్శన అందరినీ అలరించిం ది.ఇండియా-కో ఎగ్జిస్టింగ్ విత్ ట్రెడిషన్ అండ్ మోడర్నిటీ పేరిట నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ హెచ్ఎస్ హరేంధర్ ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతర్జాతీయ ప్రసిద్ధి గాంచిన ప్రముఖ నృత్యకారుడు మధునటరాజ్ పర్యవేక్షణలో సాగిన నృత్యప్రదర్శన వినూత్నంగా సాగింది.

ఈ సందర్భంగా పరంపర ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ నాగి బి.రావు, శశిరెడ్డి మాట్లాడుతూ సంప్రదాయ కళలు ఆధునిక కాలంలోనూ ఎలా ప్రాముఖ్యత సంతరించుకుంటున్నాయో ప్రజలకు తెలియడం తమ లక్ష్యమన్నారు. ఆలయాలు, కోటలు, వంటి ప్రదేశాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా కళాపరిరక్షణ, వారసత్వ సంరక్షణకు పరంపరా ఫౌండేషన్ ద్వారా కృషి చేస్తున్నట్టు వివరించారు. ఈ ప్రదర్శనలు ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో భారతీయ కళలను ప్రోత్సహించే తమ ఫౌండేషన్ గతంలో అనేక ప్రశంసలు అందుకున్నదని వెల్లడించారు.



నృత్యోత్సవంలో కళాకారుల ప్రదర్శన



కళాకారుల నృత్యాభినయం

స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ రన్నరప్‌గా విశాఖ

జాతీయ టోర్నీకి నలుగురు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న సింహాద్రినాయుడు

విశాఖపట్నం, స్పోర్ట్సు, నవంబరు (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్-19 బాలుర ఫుట్‌బాల్ టోర్నీలో విశాఖ జట్టు రన్నరప్ ట్రోఫీని సాధించింది. గుంటూరులో జరిగిన ఈ టోర్నీలో అద్భుతంగా రాణించిన సీహెచ్ దుర్గాప్రసాద్ (ఏవీఎన్ కాలేజి), వి.స్రవంత్ (బుల్లయ్య కాలేజి), బి.మనుష్ సాయి చంద్ర (యూఎన్ అకాడమీ), సీహెచ్ సందీప్ (జెడ్పీ హైస్కూల్) జాతీయ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏవీఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు, ఫిజికల్ డైరెక్టర్ ఎస్.గోపీకృష్ణ జాతీయ టోర్నీకి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

పర్యాటక ప్రాంతాల్లో సందర్శకుల సందడి

» విద్యా సంస్థల నుంచి బృందాలుగా విద్యార్థులు » జూ పార్కు, కంబాలకొండ, ముడసర్లోవ పార్కులో ఆటపాటలతో కోలాహలం



ఫొటోలు దిగుతూ విద్యార్థుల ఉత్సాహం

ఆరిలోవ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మూడో సోమవారం నేపథ్యంలో ఇందిరా గాంధీ జూ పార్కుకు పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. ఉదయం 8 గంటల నుంచి సందర్శకుల టిక్కెట్ కౌంటర్ వద్ద బారులు తీరారు. నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా సందర్శకులు విచ్చేశారు. సుమారు పదివేల మంది సందర్శకులు జూ సందర్శనకు వచ్చారని, వీరి నుంచి సుమారు రూ.7,57,530 ఆదాయం సమకూరినట్టు క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. జూ పార్కు అంతా సందర్శకులతో నిండిపోయింది. అధిక శాతం మంది కుటుంబ సమేతంగా, బృందాలు ఏర్పడి రావడంతో సందడి నెలకొంది. చిన్నారులు ఆడుతూ పాడుతూ కనిపించారు. పెద్దలు, పిల్లలు తేడా లేకుండా ఊడల మర్రి చెట్టు వద్ద ఊడలు ఊగుతూ ఉత్సాహంగా గడిపారు. అలాగే కంబాల కొండ పార్కుని సుమారు 900 మంది సందర్శకులు సందర్శించారు. వీరి నుంచి సుమారు రూ.65 వేల ఆదాయం సమకూరినట్టు కంబాలకొండ అటవీ శాఖాధికారులు తెలిపారు. అలాగే సహజ సిద్ధమైన ముడసర్లోవ పార్కు కూడా సందర్శకులతో కిటకిట లాడింది. ఈ పార్కులో పలు సంఘాలు, వివిధ కళాశాలల విద్యార్థులు వనభోజనాలు చేశారు. రోజంతా ఆనందోత్సాహాలతో గడిపారు.



టికెట్ కౌంటరు వద్ద బారులు



ఏనుగుల మోటు వద్ద సెల్ఫీ సందడి



ఆటపాటలతో చిన్నారుల హంగామా..

వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు

ఆరిలోవ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వృత్తి విద్యా కోర్సులు నేర్చుకోవడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని సంఘమిత్ర సోషల్ వర్క్ సొసైటీ వ్యవస్థాపకుడు ఎ. సూరిబాబు అన్నారు. ఆయన ఆదివారం దీనదయాళపురంలో గల ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో నిర్వహిస్తున్న బాలలహక్కుల వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ప్లంబింగ్, వెల్డింగ్ వంటి కోర్సుల ప్రాధాన్యం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్మశానంలో శ్రమదానం



శ్రమదానం చేస్తున్న యువకులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అప్పుఘర్ శ్మశాన వాటికలో శనివారం స్థానికులు యువకులు, గ్రామస్థులు, టీడీపీ నాయకుడు గొలగాని పోలారావు తదితరులు శ్రమదానం చేశారు. ఈ శ్మశాన వాటికలో మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు కూడా ఇబ్బందిగా ఉంది. అడుగడుగునా ముళ్ల పొదలు, రాళ్ల రప్పలతో ఉన్న ఈ ప్రాంతాన్ని శుభ్రం చేయడానికి ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరు ప్రాంతీయులు నడుంచుట్టారు. రహదారులను నడవడానికి అనుకూలంగా రూపొందించారు. యువకులు మాట్లాడుతూ ఇక్కడ ఇబ్బందిగా ఉండడం వల్ల శ్రమదానం చేసి సమస్య పరిష్కరించామన్నారు.

పలు వార్డుల్లో చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలను స్వీకరిస్తున్న బైరెడ్డి పోతన్నరెడ్డి, చోడే వెంకట పట్టాభిరామ్ తదితరులు

పెదవాల్తేరు, నవంబరు 17 : గ్రేటర్ విశాఖ 20వ వార్డులో టీడీపీ వార్డు అధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పి.వాసు, మద్ది శ్రీను, మామిడి సురేష్, పిడింట్ల శ్రీను, చింతపల్లి సూర్యనారాయణ, కంబాపు శివారెడ్డి, కాకి శివ, మరడ సీతన్న గోపి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : జీవీఎంసీ 10 వ వార్డులో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీ సభ్యత్వాలను నమోదు చేశారు. వందలాది మంది సభ్యత్వాలు స్వీకరించారు. తోటగరువు, ఎస్ఐజీ నగర్, వివేకానందనగర్, బీఎస్ఆర్ నగర్‌లో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి మద్దిల రాజశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి రాజేష్, నాయకులు వేముల వెంకటరావు, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీడీపీ నేతలు

'స్పష్టమైన భావ వ్యక్తీకరణ చాలా అవసరం'

ఎంవీపీ కాలనీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి ఎదుగుదలకు స్పష్టమైన భావ వ్యక్తీకరణ చాలా అవసరమని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఐఐఎం బిజినెస్ స్కూలులో ఆదివారం 'టోస్ట్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ హోస్ట్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ ఆన్ కమ్యూనికేషన్ అండ్ లీడర్‌షిప్' అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ చక్కని, అర్థవంతమైన సంభాషణ ఎలా ఉపయోగపడేది సోదాహరణంగా వివరించారు. వ్యక్తిగత, వృత్తిపరమైన సమాజ వృద్ధిని సాధించడంలో కమ్యూనికేషన్ కీలక పాత్ర అని చెప్పారు. ఎ హబ్ సీఈవో రవి ఈశ్వరప్ప, పారిశ్రామికవేత్త రానా ఉప్పలపాటి, కళాశాల జాయింట్ డైరెక్టర్ బాలాజీ తదితరులు ప్రసంగించారు.



కార్యక్రమంలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చీ

జీవో నం.3ను పునరుద్ధరించాలి

» గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు రమణ



సమావేశంలో మాట్లాడుతున్న రమణ, వేదికపై సంఘ నేతలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల సంక్షేమం కోసం 1/ 70 చట్టాన్ని పటిష్టంగా అమలు పరచి, జీవో నెంబరు 3ను పునరుద్ధరించాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు పీవీ రమణ విజ్ఞప్తి చేశారు. గిరిజన సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం ఎంవీపీ కాలనీలోని గిరిజన్ భవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా రమణ మాట్లాడుతూ పెసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. అలాగే అటవీ హక్కుల సంరక్షణ చట్టాని కొనసాగించాలని డిమాండ్ చేశారు. పోలవరం కోసం భూములను కోల్పోయిన నిర్వాసితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు తిరుపతిరావు, రాష్ట్ర అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ, జిల్లా సంఘం ప్రతినిధులు కోటేశ్వరరావు, సత్యారావు, డిప్పాల పాల్గొన్నారు.

వినికిడి సమస్య పిల్లల వికాసానికి శాపం

» ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ రాధాకృష్ణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ రాధాకృష్ణ తదితరులు

రామ్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో వినికిడి సమస్యను ప్రాథమిక దశలోనే గుర్తించాలని, లేకుంటే వారి వికాసానికి ఈ సమస్య అవరోధంగా మారుతుందని ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ రాధాకృష్ణ అన్నారు. జాతీయ నవజాత శిశువుల సంరక్షణ వారోత్సవాల సందర్భంగా రామ్‌నగర్‌లోని గిగిల్స్ ఓమ్ని ఆస్పత్రి సముదాయంలో వినికిడి పరీక్ష విధానం, ప్రీ టెర్మ్ కేర్ పేరిట నవజాత శిశువులకు వైద్యాన్ని అందించే నియోనెంటాలజిస్టుల వైద్య విద్యా సదస్సు నిర్వహించారు, ఈ సందర్భంగా డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ పిల్లలు నెలలు నిండకుండానే పుడితే వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. అందులో వినికిడి సమస్యపై దృష్టి సారించాలన్నారు. ఈ నెల 24 వరకు ప్రత్యేకంగా మూడు నెలలలోపు పిల్లలకు ఉచిత వినికిడి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు, ఈ సమావేశంలో డాకర్ మౌనిక, డాక్టర్ సందీప్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఐఈఈఈ రీసోర్సెస్ వినియోగంపై అవగాహన అవసరం

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ (ఐఈఈఈ) ఇంజనీరింగ్ రీసోర్సెస్ ఎంతగానో ఉపయో గపడుతున్నాయని ఐఈఈఈ సీనియర్ క్లైంట్ సర్వీసెస్ మేనేజర్ ధను పటాన్‌శెట్టి అన్నారు.ఏయూలోని డాక్టర్ వీఎస్ కృష్ణ సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఇంపార్టెన్స్ ఆఫ్ ఐఈఈఈ రీసోర్స్ ఇన్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సులో వర్చువల్‌గా పాల్గొన్న ఆయన ఐఈఈఈ రీసోర్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐఈఈఈ ద్వారా విస్తృత శ్రేణి జర్నల్స్, వాటి వినియోగం, సమాచార మార్పిడి, నిపుణుల సలహాలు వంటివి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో చీఫ్ లైబ్రేరియన్ ప్రొఫెసర్ పి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మిసెస్ వైజాగ్-24 పోస్టర్ ఆవిష్కరణ

» డిసెంబరులో విశాఖలో గ్రాండ్ ఫినాలే

రామ్‌నగర్, నవంబరు 17 : (ఆంధ్రజ్యోతి) : వివాహిత మహిళా సాధికారత, తమ కలలను సాకారం సాధించేందుకు అవసరమైన ఆత్మవిశ్వాసం అందించేందుకు మిసెస్ వైజాగ్ పోటీల వేదిక దోహదపడుతుందని పోటీల నిర్వాహకులు వాసు పేర్కొన్నారు. రామ్‌నగర్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం మిసెస్ వైజాగ్-2024 పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా మిసెస్ వైజాగ్ పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.ఈ ఏడాది డిసెంబరులో విశాఖలోనే ఫైనల్ గ్రాండ్ ఫినాలే నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఆన్‌లైన్ ఆడిషన్స్ ప్రారంభం అయ్యాయని, టాలెంట్ సెమీఫైనల్స్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఫైనల్స్‌లో 23 మంది పోటీ పడనున్నారని, వీరిలో 10 మందికి టైటిల్ హోల్డర్స్ ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో దివ్య, శ్రావ్య, ఇషా ఇందు సరితా, దియా సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ

ఎంవీపీ కాలనీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని నగర శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం విశ్రాంత ఉద్యోగులు బి.ఆనందరావు, కె.రాములు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఉద్యమకారులు ఎస్సార్ రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేశారు. గ్రంథాలయాలను వినియోగించుకోవడం ద్వారా విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ఇంకా చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి కేవీఎ ఉమామహేశ్వరరావు తెలిపారు.

కాంగ్రెస్ కమిటీ నియామక ప్రక్రియకు శ్రీకారం



ప్రియాంక దండి

సిరిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ కమిటీ నియామక ప్రక్రియ మొదలైందని కాంగ్రెస్ పార్టీ తూర్పు ఇన్‌చార్జ్ ప్రియాంక దండి తెలిపారు. గ్రామ, మండల, వార్డు కమిటీలకు సంబంధించి విశాఖలోని అన్ని వార్డులకు ఈ నెలాఖరులోగా అధ్యక్షుల ఎంపిక పూర్తి చేయాలనే లక్ష్యంతో పార్టీ ఉందన్నారు.రాజకీయాలు, ప్రజా సేవపై ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.ఇతర వివరాలకు ఫోన్ 63058 21260లో సంప్రదించాలని ఆమె కోరారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



ఆరిలోవ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా దేవస్థానం కాంప్లెక్స్‌లో గల అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం తొలి మండల పడిపూజ ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మాలధారణ భక్తులు పూజలో పాల్గొన్నారు. శబరిమలలో శనివారం అయ్యప్ప తొలి మండల పూజలు నిర్వహించిన సందర్భంగా ఆరిలోవలో హరహర పుత్రునికి విశేష పూజలు నిర్వహించారు. క్షీరాభిషేకం, నెయ్యాభిషేకం, విభూతి, పంచామృతాభిషేకాలు నిర్వహించారు.